ఉండిలో మచిలీపట్నం-విశాఖ రైలు ఆపాలని వినతి

ప్రజాశక్తి - ఉండి

మచిలీపట్నం-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైలును ఉండిలో ఆపాలని కోరుతూ ఉండి రైల్వే ప్రయాణికుల సంఘం తరపున రైల్వే బోర్డు ఛైర్మన్‌కు వినతి పంపినట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు కొమ్మన నాగబాబు, సిహెచ్ బంగార్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కరోనాకు ముందు మచిలీపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ ఉండిలో ఆపేవారని పేర్కొన్నారు. కరోనా అనంతరం ఉండిలో హాల్టు తొలగించడం తగదన్నారు. ఉండి పరిసర ప్రాంతాల ప్రజలు విశాఖపట్నం వెళ్లేందుకు ఇది అనువైన రైలు అని, రైల్వే అధికారులు పరిశీలించి ఇక్కడ హాల్టు పునరుద్దరించాలని కోరారు. ఉండి స్టేషన్‌లో ఖాళీ గూడ్స్ రైలు నిలిపి ఉంచడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరారు. స్టేషన్ వద్ద విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని దక్షిణమధ్య రైల్వే జిఎంకు, విజయవాడ డిఆర్‌ఎంకు, నరసాపురం ఎంపి కనుమూరి రఘురామకృష్ణంరాజుకు వినతులు పంపినట్లు పేర్కొన్నారు.

చంద్రబాబు అరెస్టుపై..

హైటెన్షన్..!

★ రోడ్డెక్కిన తెలుగు తమ్ముళ్లు
★ నల్ల బ్యాడ్జీలు, జెండాలతో నిరసన ర్యాలీలు, ధర్నాలు
★ పాలకొల్లు, ఉండి ఎంఎల్‌ఎలు గృహనిర్బంధం
★ తోపులాటలో కిందపడి అస్వస్థతకు గురైన నిమ్మల, అంగర
★ తణుకులో రోడ్డుకు అడ్డంగా పడుకుని ఆరిమిల్లి రాధాకృష్ణ నిరసన
★ జిల్లావ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో మోహరించిన పోలీసులు

పాలకొల్లులో తోపులాటలో కింద పడ్డ నిమ్మల, అంగరతో చర్చిస్తున్న డిఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుతో జిల్లాలో హైటెన్షన్ నెలకొంది. తెలుగుతమ్ముళ్లు ఆగ్రహావేశాలతో రోడ్డెక్కడంతో నిరసనలు పెల్లుబికాయి. నల్ల బ్యాడ్జీలు, నల్ల జెండాలతో నిరసన ర్యాలీలు నిర్వహించారు. జిల్లాలో ప్రధాన కూడళ్లలో పోలీసులు పెద్దసంఖ్యలో మోహరించి గస్తీ నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేశారు. పాలకొల్లులో జరిగిన తోపులాటలో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు కింద పడి అస్వస్థతకు గురికావడంతో ఉద్రిక్తత నెలకొంది. ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు భీమవరంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో చంద్రబాబును అరెస్టు చేశారనే వార్త తెలియగానే జిల్లావ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. టిడిపికి చెందిన ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్‌సిలు, ముఖ్య నేతలను గృహనిర్బంధం చేశారు. రోడ్లపైకి నిరసనకారులు రాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ప్రధాన కూడళ్లలో పోలీసులు పెద్దసంఖ్యలో మోహరించారు. వాహనాలను తనిఖీ చేపట్టారు. ఉండి మెయిన్ సెంటర్‌లో తెలుగు తమ్ముళ్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ చేపట్టారు. ఆకివీడులో ర్యాలీ నిర్వహించి దుకాణాలను మూయించారు. తాడేపల్లిగూడెం ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద టిడిపి శ్రేణులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఐలాండ్ వద్ద మానవహారం నిర్వహించి అనంతరం పట్టణంలో దుకాణాలను మూయించారు. పోడూరు, కాళ్ల, పిప్పరలో ధర్నాలు నిర్వహించారు. తణుకు పట్టణంలో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. పెనుమంట్ర మండలం మార్టేరు సెంటర్‌లో నిరసనకు దిగిన తెలుగు తమ్ముళ్లను పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. వీరవాసరం, పాలకోడేరు, మొగల్తూరు, గొల్లలకోడేరు తదితర ప్రాంతాల్లో ఆందోళనలు నిర్వహించారు.

రోడ్డుకు అడ్డంగా పడుకుని మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి నిరసన

తణుకు నరేంద్ర సెంటర్‌లో మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి రోడ్డుకు అడ్డంగా పడుకుని నిరసన తెలిపారు. మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, మరికొంత మంది టిడిపి నేతలను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. దీనిపై రాధాకృష్ణ పోలీస్ స్టేషన్లోనే నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు.

తణుకులో రోడ్డుపై బైఠాయించిన మాజీ ఎంఎల్‌ఎ రాధాకృష్ణ

చంద్రబాబు విడుదలయ్యే వరకు నిరసనలు

ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

తమ అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని, ఆయన్ను విడుదల చేసే వరకు నిరసనలు కొనసాగిస్తామని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు హెచ్చరించారు. ఎంఎల్‌ఎ రామరాజును భీమవరంలో పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈ నేపథ్యంలో రామరాజు తన ఇంటి వద్దే బయట 24 గంటలు నిరసన దీక్ష చేపట్టారు. దీంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడారు.

భీమవనంలో ఉండి ఎంఎల్‌ఎ రామరాజు నిరసన

ఎంఎల్‌ఎ నిమ్మల గృహనిర్బంధం, అరెస్టు

తోపులాటలో కిందపడ్డ నిమ్మల, అంగర

పాలకొల్లు: చంద్రబాబు అరెస్టుతో ముందు జాగ్రత్తగా పాలకొల్లులో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావును కూడా హౌస్‌అరెస్ట్ చేశారు. కొద్దిసేపటి తర్వాత వీరు ఇరువురు విజయవాడ వెళ్లేందుకు బయల్దేరగా నరసాపురం డిఎస్‌పి మనోహరాచారి, సిఐ డి.రాంబాబు, ఎస్ఐలు బాదం శ్రీనివాస్, ముత్యాలరావు సారధ్యంలో ప్రత్యేక బలగాలు అడ్డుకున్నాయి. దీంతో పోలీసులకు, టిడిపి శ్రేణుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఎంఎల్‌ఎ నిమ్మల, మాజీ ఎంఎల్‌సి అంగర కిందపడిపోయారు. ఎంఎల్‌ఎ నిమ్మల అస్వస్థతకు గురవ్వడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో టిడిపి నేతలకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వివాదం సుమారు మూడు గంటలపాటు సాగింది. ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ వర్మ సారథ్యంలో ఇరువురికి వైద్యం అందించారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఎంఎల్‌ఎను అరెస్టు చేసి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్టేషన్ గేట్లు వేసి మీడియాను సైతం అనుమతించలేదు.

నరసాపురంలో మాధవనాయుడును అడ్డుకుంటున్న ఖాకీలు

చంద్రబాబు అరెస్టును ఖండించిన సిపిఎం

చంద్రబాబు అరెస్టును సిపిఎం జిల్లా కమిటీ ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ సిఎం, ప్రధాన ప్రతిపక్ష నేత అరెస్టు తీరు దారుణమని పేర్కొనారు. పైగా జిల్లాలో ప్రతిపక్ష నేతలు, ప్రజాప్రతినిధులను గృహనిర్బంధం చేయడం దారుణమని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటరు విషయంలో వచ్చిన అవినీతి ఆరోపణలపై నిష్పాక్షిక, చట్టబద్ధ జరిపి అప్పుడు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్వచ్ఛదంగా వ్యాపార దుకాణాలు మూసివేత

ప్రజాశక్తి - ఆకివీడు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకులు ఆ పార్టీ కార్యాలయం వద్ద నుంచి పాత బస్టాండ్ వద్ద ఉన్న మహాత్మ గాంధీ విగ్రహం వద్దకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ నుంచి పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు గొంట్ల గణపతి నాయకత్వంలో జాతీయ రహదారి గుండా నిరసన ప్రదర్శన నిర్వహించారు. సుమారు పది కిలోమీటర్ల మేర ఈ ర్యాలీ కొనసాగింది. అరెస్టు పూర్తిగా అనైతికమని, అక్రమమని గొంట్ల గణపతి విమర్శించారు. రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన, నియంత పాలన కొనసాగుతుందన్నారు. వ్యవసాయ విభాగం అధ్యక్షులు భూపతిరాజు తిమ్మరాజు, దుంపగడప సర్పంచి విశ్వేశ్వరరావు, న్యాయవాది చేబాలు శ్రీనివాస్, మైనార్టీ విభాగం జిల్లా నాయకులు అహ్మద్, యువజన విభాగం నాయకులు పూజారి ప్రసాద్, స్థానిక నాయకులు రామరాజు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా వ్యాపార దుకాణాలు మూసివేత

టిడిపి శ్రేణులు ర్యాలీ నిర్వహించడంతో వ్యాపారులు ఒకరొకరుగా షాపులు మూసివేశారు. మార్కెట్ మొత్తం స్తంభించిపోయింది.

ఆకివీడులో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ఆర్‌బికెల్లో పంట వివరాల నమోదు తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - గణపవరం

స్థానిక రైతుభరోసా కేంద్రాల్లో రైతులు తమ పంట వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర రావు అన్నారు. శనివారం మొయ్యేరు రైతుభరోసా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు భరోసా కేంద్రం వద్ద పంట వివరాలు నమోదు చేసుకునే సమయంలో పొరపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. కేంద్రంలో వేలి ముద్రలు వేయాలన్నారు. ఇ-క్రాప్ నమోదు ఎలా సాగుతుందని మండల వ్యవసాధికారి ప్రసాద్‌ను ప్రశ్నించారు. 9894 ఎకరాల్లో వివరాలు నమోదయ్యాయని, మిగిలిన 1826 ఎకరాల వివరాలు మరో రెండు రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో విఎఎ చంద్రకళ, విఆర్‌ఒ పుష్పరాజ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

మాట్లాడుతున్న ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు

భవిష్యత్తు ప్రయోగాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలి

ఎస్ఆర్‌కెఆర్ కళాశాలలో చంద్రయాన్-3 విజయోత్సవం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చంద్రయాన్-3తో భారతదేశం ప్రపంచంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో అగ్రస్థానంలో నిలిచిందని, దీని స్ఫూర్తితో ఇంజినీరింగ్, సైన్స్ విద్యార్థులు భవిష్యత్తు ప్రయోగాల్లో భాగస్వాములు కావాలని ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. విద్యార్థుల్లో చంద్రయాన్-3 స్ఫూర్తి నింపేందుకు ఎఐసిటిఇ సూచనల మేరకు కళాశాలలో శనివారం చంద్రయాన్-3 విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఇంగ్లీష్, ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ డాక్టర్ బిహెచ్‌విఎన్.లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జగపతిరాజు మాట్లాడుతూ భారతదేశం భావి ప్రయోగాల కోసం యువ ఇంజినీర్ల వైపు చూస్తుందని, అందుకు భారత ప్రభుత్వం ఈ విజయాన్ని కళాశాల విద్యార్థులతో కలిసి పంచుకోవాలని సూచించిందని తెలిపారు. కళాశాల స్థాయిలోనే మినీ శాటిలైట్ల ప్రయోగానికి ఇస్రో కూడా ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా చంద్రయాన్-3 విజయోత్సవంపై వివిధ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఇస్రో అందించిన ప్రత్యేక శాటిలైట్ వీడియోలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత

కడకట్ల అర్బన్ హెల్త్‌సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి కొట్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్య, వైద్య రంగాలకు వైసిపి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక కడకట్లలో రూ.1.20 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన ఎనిమిది పడకల అర్బన్ హెల్త్ సెంటర్ భవనాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారతలను ప్రాధాన్యత రంగాలుగా గుర్తించారని చెప్పారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ ఆసుపత్రులను నాడు-నేడులో ఆధునీకరించి అవసరమైన వైద్య పరికరాలను సమకూర్చారని చెప్పారు. ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను, పారామెడికల్ పోస్టులను నూటికి నూరు శాతం భర్తీ చేసినట్లు తెలిపారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో రూ.12 కోట్లతో అదనపు భవనాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. తాడేపల్లిగూడెం పట్టణంలో యాగర్లపల్లి, వికర్స్‌కాలనీ, బేబి సెంటర్‌తో పాటు కొత్తగా కడకట్లలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చి ప్రపంచం దృష్టిని ఆకర్షించారన్నారు. అత్యవసర సేవల కోసం 108 అంబులెన్స్‌లను తీసుకువచ్చారన్నారు. ఆరోగ్యశ్రీలో కేవలం ఖరీదైన వైద్యం చేయించడమే కాకుండా ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లాక తిరిగి పనిలోకి వెళ్లే వరకు ఆ కుటుంబాలను ఆదుకునే విధంగా ఆరోగ్య ఆసరా పథకాన్ని సిఎం జగన్ ప్రవేశపెట్టారన్నారు. అవసరమైన వారు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సిఎం జగన్ ఎంతో ఉదారతతో ఆరోగ్యశ్రీతో పాటు సిఎంఆర్‌ఎఫ్, ఎల్‌ఒసి ద్వారా పేద ప్రజలకు వైద్య సహాయం అందిస్తున్నారని చెప్పారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలో మంత్రి కొట్టు సత్యనారాయణ మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ముత్యాల ఆంజనేయులు, డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.మహేశ్వరంరావు, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, మున్సిపల్ ఇంజినీర్ డి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

కడకట్ల హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

జాతీయ లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న మూడో అదనపు జిల్లా జడ్జి

లోక్ అదాలత్‌లో 965 కేసులు పరిష్కారం

మూడో అదనపు జిల్లా జడ్జి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 965 కేసులు పరిష్కరించినట్లు భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, మూడో అదనపు జిల్లా జడ్జి పి.శ్రీసత్యాదేవి తెలిపారు. భీమవరం మండల న్యాయసేవాధికార ఆధ్వర్యంలో కోర్టులో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కక్షిదారులు పంతానికి పోకుండా రాజీ చేసుకోవడం ద్వారా సమయం వృధాకాదన్నారు. కక్షిదారులు, న్యాయవాదులు సహకరిస్తేనే త్వరితగతిన న్యాయం జరుగుతుందన్నారు. ప్యానల్ లాయర్స్ పారా లీగల్ వాలంటీర్లు, మీడియా సహకరించడం వల్లే ఈ సారి ఎక్కువ కేసులు రాజీ చేసినట్లు తెలిపారు. ఈ అదాలత్‌లో సివిల్ కేసులు 32, భీమవరం టౌన్, రూరల్, వీరవాసరం, ఉండి, పాలకోడేరు, కాళ్ల, ఆకివీడు పోలీస్‌స్టేషన్లకు సంబంధించిన క్రిమినల్ కేసులు 110, మనోవర్తి కేసులు 10, చెక్ బౌన్స్ కేసులు 34, బ్యాంక్ రికవరీ కేసులు 28, ఎస్‌టిసి కేసులు 742, బిఎస్‌ఎన్‌ఎల్ కేసులు 8 మొత్తం 965 కేసులను ఉభయ పార్టీల కోరిక మేరకు రాజీ చేసినట్లు తెలిపారు. సివిల్, చెక్ బౌన్స్ ప్రి లిటీగిషన్ కేసుల్లో మొత్తం రూ.2,9,20,250 అవార్డులను జారీ చేసి ఉన్నారని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌ను ఐదు బెంచ్‌లుగా ఏర్పాటుచేశారు. న్యాయమూర్తులుగా సీనియర్ సివిల్ న్యాయమూర్తి అప్పలస్వామి, ప్రిన్సిపల్ సివిల్ న్యాయమూర్తి పవన్‌కుమార్, ఒకటో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి జి.సురేష్‌బాబు, రెండో అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ డి.ధనరాజు, సభ్యులుగా వివి.సుబ్బారావు, బి.త్రిమూర్తులు, బి.దీనప్రకాశమ్మ, ఎస్.నాగబాబు, సిహెచ్.జాన్సీలక్ష్మి వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటరమణరావు, కార్యదర్శి పి.రమేష్‌బాబు, పోలీస్ అధికారులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నరసాపురంలో 753 కేసులు రాజీ

నరసాపురం టౌన్ : నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నరసాపురం కోర్టుల ప్రాంగణంలో పెండింగ్, ప్రీ లిటిగేషన్ కేసుల పరిష్కారం నిమిత్తం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. క్రిమినల్ కేసులు 717, సివిల్ కేసులు ఐదు, బ్యాంకు, బిఎస్‌ఎన్‌ఎల్ మొండి బాకీ కేసులు 31 మొత్తం 753 కేసులు రాజీ అయ్యాయి. సుమారు రూ.53 లక్షల విలువైన కేసులను రాజీ చేశారు. సిట్టింగ్ న్యాయమూర్తిగా సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు, సభ్యులుగా న్యాయవాదులు శ్రీధర్, సూర్యప్రకాశరావు, క్రిమినల్ కేసుల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన బెంచ్‌కు సిట్టింగ్ న్యాయమూర్తిగా ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, సభ్యులుగా న్యాయవాది అనీష్‌వర్మ వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు చల్లా దానయ్యానాయుడు, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కక్షిదారులకు బార్ అసోసియేషన్ తరపున సీనియర్ న్యాయవాది స్వామినాయుడు పులిహోర అందించారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఎఇ ఫణీంద్ర లబ్ధిదారులకు సూచించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని జగన్నాథపురం జగనన్న కాలనీలో ఆయన పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న లే అవుట్లో అప్రోచ్ రోడ్లకు రూ.3.50 లక్షలు, రెండోసారి లెవెలింగ్‌కు రూ.2.50 లక్షల నిధులు మంజూరు చేశారు. లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల్లో లెవెలింగ్ పూర్తి కావడంతో, ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు వచ్చి వేగవంతంగా నిర్మించుకోవాలన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపడితే ప్రభుత్వపరంగా అందించాల్సిన రుణాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆయనతో పాటు డిజిటల్ అసిస్టెంట్ రాధాకృష్ణ, సర్వేయర్ రవికుమార్ ఉన్నారు.

లే అవుట్‌ను పరిశీలిస్తున్న ఎఉఇ ఫణీంద్ర

యాత్రలు.. దాడులు..!

యువగళం పాదయాత్ర, ఉద్రిక్త ఘటనలతో జిల్లా రాజకీయం మరింత వేడెక్కింది. అధిక ధరలు, నిరుద్యోగం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం నిర్వహించిన సమరభేరీ ప్రజల్లో చర్చనీయాంశమైంది.

యువగళం పాదయాత్ర ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో శుక్రవారం రాత్రితో ముగిసింది. ఆగస్టు 24వ తేదీ రాత్రికి ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గంలో ప్రవేశించిన యాత్ర ఉమ్మడి జిల్లాలో 15 రోజులపాటు ఎనిమిది నియోజకవర్గాల మీదుగా సాగింది. యాత్రకు జన స్పందన బాగానే ఉందని విశ్లేషకుల అంచనా. రూట్‌మ్యాప్ ముందుగా ఖరారు కాకపోవడం ఒక లోపంగా ఉండగా పార్టీలోని గ్రూపులు మాత్రం పోటాపోటీగా జన సమీకరణకు దిగడం యాత్రకు ఊపునిచ్చిందని చెప్పొచ్చు. నూజివీడు మండలం తుక్కులూరు, నిడమర్రు మండలం మందలపర్రుల్లో యాత్ర సందర్భంగా టిడిపి, వైసిపి శ్రేణుల నడుమ ఘర్షణ చోటుచేసుకున్నా కొద్దిసేపటికే సమసిపోయాయి. అయితే భీమవరంలో చోటుచేసుకున్న ఘటన మాత్రం చర్చనీయాంశం కావడంతోపాటు అరెస్టులకు దారితీసింది. ఒకవిధంగా చెప్పాలంటే ఈ ఘర్షణ పోలీసుల ప్రతిష్టను బజారున పడేసిందనే చెప్పాలి. భీమవరం సభలో లోకేష్ విమర్శలు, ఫ్లకార్డుల ప్రదర్శనతో వైసిపి శ్రేణులు ఆగ్రహావేశాలకు గురయ్యాయనే సమాచారం ఉన్నా పోలీసులు సరైన రీతిలో స్పందించలేదనే ఆరోపణలు ఉన్నాయి. పైగా లోకేష్ పాదయాత్ర వెళ్లే మార్గంలో తాడేరు వంతెన వద్ద నుంచి టౌన్‌షిప్ వరకూ వైసిపి శ్రేణులు పెద్దసంఖ్యలో సుమారు గంట ముందు నుంచే మోహరించి ఉన్నా పోలీసులు స్పందించలేదనే విమర్శలు ఉన్నాయి. ముందుగానే వారికి సర్దిచెప్పి పంపించేసి ఉంటే ఈ ఘటన చోటుచేసుకునేది కాదు. ఈ సమాచారం తెలిసి టిడిపి శ్రేణులు సైతం దాడిని ప్రతిఘటించడానికి సిద్ధమై రంగంలోకి దిగడంతో పరిస్థితి చేయిదాటింది. ఫలితంగా పలువురు పోలీసులతోపాటు టిడిపి శ్రేణులకు, స్థానికులకు, వైసిపి శ్రేణులకు గాయాలయ్యాయి. ఆపై వైసిపి కార్యకర్తల ఫిర్యాదు మేరకు టిడిపి నేతలతోపాటు యువగళం వాలంటీర్లపై కేసు నమోదు చేసిన పోలీసులు సుమారు 39 మంది యువగళం కార్యకర్తలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. టిడిపి నేతలను అరెస్టు చేయడంతోపాటు టిడిపి నేతల ఫిర్యాదు మేరకు వైసిపి శ్రేణులపైనా చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు చెబుతున్నారు. తుక్కులూరు, మందలపర్రు ఘటనలు ఎలాగున్నా భీమవరం ఘటనపై మాత్రం విచారణ జరగాల్సి ఉంది. లోకేష్ విమర్శలు ఘాటుగా ఉండొచ్చు. వాటిని ఖండించడమో, లేదో మరోరూపంలోనో తిప్పికొట్టొచ్చు. ఒకవేళ అదీకాదనుకుంటే లోకేష్‌పై పరువునష్టం దావా వేయొచ్చు. అయితే ఉన్న మార్గాలన్నింటినీ వదిలేసి విమర్శ, ప్రతివిమర్శ రాజకీయాల్లో సహజం అనే అంశాన్ని మరిచి భౌతిక దాడులకు తెగబడటం దిగజారుడు, ప్రతికారేచ్ఛ రాజకీయాలకు ప్రతిబింబమని చెప్పక తప్పదు. ఒకవిధంగా చెప్పాలంటే లోకేష్ ఆరోపణలను తిప్పికొట్టేలా బలమైన వాదన విన్పించడం మాని ఇలా ప్రతిదాడులకు దిగడం అంటే 'నిప్పు లేకుండా పొగ వస్తుందా' అనే చందంగా వాస్తవాలు ఎలాగున్నా లోకేష్ ఆరోపణలు నిజమేనేమో అనుకునే ప్రమాదం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకునైనా దుందుడుకు రాజకీయాలు మానుకుని ప్రజాక్షేత్రంలో ఆత్మవిమర్శ ధోరణితో ముందుకు సాగితే ఆయా రాజకీయ పక్షాలకే ఉపయోగకరమని పరిశీలకులు సూచిస్తున్నారు.

ప్రజా సమస్యలపై సిపిఎం సమరభేరి

అధిక ధరలు, నిరుద్యోగం, భారాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం సమరభేరి మోగించింది. ప్రధాన సమస్యలతోపాటు స్థానిక సమస్యలపైనా ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించిన సిపిఎం శ్రేణులు పెద్దఎత్తున సంతకాల సేకరణ చేపట్టాయి. ఆపై ఆయా వినతులను సచివాలయాలు, తహాశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టి అధికారులకు అందించారు. విమర్శలు, ప్రతిదాడుల్లో ప్రధాన రాజకీయపక్షాలు మునిగిపోతుండగా ప్రజా పోరాటాల రథసారధి సిపిఎం ఎప్పటిలానే పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలపై సమరభేరి నిర్వహించి వారి గొంతుకలా నిలిచింది. ప్రస్తుత సమస్యలకు పరిష్కారం చూపించే సత్తా తమకే ఉందని ప్రత్యామ్నాయ రాజకీయాలకు కేంద్ర బిందువైన సిపిఎం మరోసారి చాటిచెప్పింది.

లోకేష్ వంద రోజుల మంత్రం

లోకేష్ ఆయా నియోజకవర్గాల్లో యాత్ర సందర్భంగా తన దృష్టికి వచ్చిన సమస్యలు, వివిధ తరగతుల ప్రజానీకంతో నిర్వహించిన ముఖాముఖీల్లో వచ్చిన వినతులపై నిర్దిష్టంగానే స్పందించారు. ఆయా ముఖాముఖీలు లేదా సభల్లో ఆయా సమస్యలు ప్రస్తావిస్తూ తాము అధికారంలోకి రాగానే కచ్చితంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎక్కువ సమస్యలకు తాము అధికారంలోకొచ్చిన వంద రోజుల్లో పరిష్కారం అనే మంత్రం ఎక్కువ జపించారు. నూజివీడు, చింతలపూడి, పోలవరం, ఉంగుటూరు, భీమవరం ఎంఎల్ఎలపై ఘాటైన విమర్శలు ఎక్కుపెట్టిన లోకేష్ ఉండిలో అధికార పార్టీ నేతలు, నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి ప్రసాద్‌రాజు గురించి గాని నోరు మెదపకపోవడం చర్చనీయాంశమైంది.

వీడని విబేధాలు.. పట్టించుకోని అధినేతలు

ఇక నూజివీడు, చింతలపూడి, పోలవరం, భీమవరం, నరసాపురంల్లో టిడిపి నేతల మధ్య విబేధాలు ఎక్కువగానే ఉన్నాయి. వాటి జోలికి వెళ్లకుండా లోకేష్ మౌనం వహించారు. జనాన్ని ఆకట్టుకోవడం ఒక ఎత్తయితే తమ నేతల మధ్య అనైక్యతను రూపుమాపకపోతే కచ్చితంగా ఎన్నికల్లో ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంది. మరి అధిష్టానం దీనిపై ఎలా ముందుకెళ్తుందో వేచిచూడాలి. ఏదేమైనా లోకేష్ యాత్ర టిడిపి శ్రేణుల్లో జోష్ నింపిందనే చెప్పొచ్చు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

దంత పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

140 మందికి దంత పరీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శశి ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకంలో భాగంగా శనివారం తాడేపల్లిగూడెం ఎఫ్‌సిఐ కాలనీలో ఉన్న శాంతి రెసిడెన్షియల్ పాఠశాల, హాస్టల్‌లో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. భీమవరం విష్ణు దంత వైద్య కళశాల, హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విష్ణు కళాశాల క్యాంపు ఇన్‌ఛార్జి డాక్టర్ పి.ఆదిత్య, వారి సిబ్బంది పాల్గొన్నారు. శశి ఇంజినీరింగ్ కళాశాల వారి సహకారంతో హాస్టల్ విద్యార్థులకు ఉచితంగా వైద్యం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ హాస్పిటల్ సిబ్బందికి, కళాశాల వాలంటీర్లకు అభినందనలు తెలిపారు. 140 పిల్లలకు, పెద్దలకు దంత పరీక్షలు నిర్వహించామని కో-ఆర్డినేటర్ సల్మాన్ బాషా తెలిపారు.

సీనియర్ పాత్రికేయులు మల్లపురాజు మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు



మల్లపురాజు (ఫైల్‌ఫొటో)

సీనియర్ పాత్రికేయులు కలిదిండి మల్లపురాజు (91) శనివారం తెల్లవారుజామున పాలకొల్లులోని తన స్వగృహంలో మృతి చెందారు. ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రారంభ కాలం నుండి పాలకొల్లు విలేకరిగా సుదీర్ఘకాలం పనిచేశారు. పాలకొల్లు ప్రెస్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులుగా చేశారు. ఎపియుడబ్ల్యుజే జిల్లా శాఖకు 1978-1984 వరకు అధ్యక్షుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా సేవలందించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి ఐజెయు జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి, జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, రాష్ట్ర అధ్యక్షుడు ఐవి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, జిల్లా కన్వీనర్ గజపతి వరప్రసాద్, జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు వి.సాయిబాబా, వై.గిరిజాపతి, బి.బుచ్చిబాబు, ఐజెయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు ముత్యాల శ్రీనివాస్, పాలకొల్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకటరమణ, కార్యదర్శి ఎంఎన్‌వి.సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు, సీనియర్ పాత్రికేయులు నరసింహరాజు, జిల్లా ఉపాధ్యక్షులు పిటి వెంకటేశ్వరరావు సంతాపం తెలిపారు.

ఉండి రైల్వే స్టేషన్ ఆవరణలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - ఉండి

ఉండి రైల్వే స్టేషన్‌లో రైల్వే ప్రయాణికుల సంఘం, శశి ఇంగ్లీషు మీడియం స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. రైల్వేస్టేషన్ ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగిపోయి చిట్టి అడవిలా మారిపోయింది. కొన్ని పిచ్చి మొక్కలు పెద్ద పెద్ద చెట్ల మాదిరిగా మారాయి. దీంతో స్టేషన్ ఆవరణలో ప్రయాణికులు రాత్రి వేళల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్పందించిన శశి ఇంగ్లీషు మీడియం స్కూల్ యాజమాన్యం, రైల్వే ప్రయాణికుల సంఘం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా వాటిని తొలగించారు. వీటితోపాటు ప్రాంగణంలో ప్రయాణికులకు, వాహనాలకు అడ్డుగా ఉన్న కొమ్మలను కూడా తొలగించారు. ఈ సందర్భంగా రైల్వే ప్రయాణికుల సంఘం అధ్యక్షులు కొమ్మన నాగబాబు, శశి ఇంగ్లీషు మీడియం స్కూల్ డైరెక్టర్ ఖండాపు శ్రీనివాసరావు, ప్రయాణికుల సంఘం కార్యదర్శి సిహెచ్.బంగారురావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కేంద్ర ప్రభుత్వం సూచించిన విధంగా స్వచ్ఛభారత్‌తో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇలాంటి మంచి కార్యక్రమంలో శశి స్కూల్ కూడా భాగస్వాములు కావడం పట్ల ప్రయాణికుల సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఉండి రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ కుమార్ మాట్లా డుతూ ప్రజలు భాగస్వాములైనప్పుడు ప్రభుత్వ సంస్థలు మరింత సమర్థవంతంగా సేవలందిస్తాయని పేర్కొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సంతోష్‌నాయుడు

'ఫ్యామిలీ డాక్టర్'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - గణపవరం

ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.సంతోష్‌నాయుడు అన్నారు. మండలంలోని అర్ధవరంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. బిపి, షుగర్ ఉన్నవారికి మందులు అందించారు. సిహెచ్ఒ విల్సన్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో 35 ఏళ్ల దాటిన వారందరూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాని వినియోగించుకుని వైద్యం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిలు దివ్యభారతి, ఎఎన్ఎం లక్ష్మీకాంతం, హెల్త్ అసిస్టెంట్ బి.రవికుమార్, 104 సిబ్బంది బి.శ్రీనివాస్, ఎ.రవి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మృతి చెందిన గేదె

కొబ్బరిచెట్టు పడి పాడి గేదె మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

కొబ్బరి చెట్టు పాడి గేదె మృతి చెందింది. మండలంలోని పేరుపాలెం సౌత్ పంచాయతీ పరిధి మేళంవారిమెరకు చెందిన మేళం వెంకటరామారావుకు రెండు పాడి గేదెలు ఉన్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కొబ్బరిచెట్టు పడి ఒక పాడిగేదె మృతి చెందింది. దీంతో వెంకటరామరావు కుటుంబసభ్యులు ఆవేదన చెంతున్నారు. గేదె విలువ సుమారు 50 వేలు ఉంటుందని రామారావు తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారం అందించినా స్పందించలేదని తెలిపారు. దీనిపై వెటర్నరీ వైద్యురాలు జి.నీలిమానం మాట్లాడుతూ రామారావు వైఎస్ఆర్ బీమా చేయించుకోలేదని, బీమా పరిహారం అందే అవకాశం లేదని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

నేడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రం మొగల్తూరులోని పెనుమత్స రంగరాజు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఈ నెల పదో తేదీ ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నామని విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ కెవిసిఎస్.అప్పారావు తెలిపారు. పాఠశాలలో 1971-72 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న ఆనాటి విద్యార్థులు అంతా ఉదయమే చేరుకోవాలని ఆయన కోరారు.

మల్లిరార్జునరావుకు పివిఎల్ పరామర్శ

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని బొండాడ గ్రామానికి మాజీ ఎంపిపి కందుల వెంకట మల్లికార్జునరావు కుటుంబాన్ని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు శనివారం పరామర్శించారు. కందుల వెంకట మల్లికార్జునరావు సతీమణి మాజీ సర్పంచి కందుల నాగమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కందుల నాగమణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పివిఎల్‌తో పాటు జెడ్‌పిటిసి సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, అనందపురం సర్పంచి కొలుకులూరి ధర్మరాజు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆధునీకరణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు గ్రామంలో కోడేరు రోడ్డులో శ్మశానవాటికలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆధునీకరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా భాగంగా ఏర్పాటు చేసిన శివుడు, సత్య హరిశ్చంద్రుడు, కాలభైరవుని విగ్రహాలను శనివారం పూలమాలలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో వెలగల నారాయణరెడ్డి, గుడిమెట్ల లక్ష్మణ్‌రెడ్డి , కొవ్వూరి బ్రహ్మేశ్వర్‌రెడ్డి , మేడపాటి సూర్యనారాయణరెడ్డి, గుత్తుల బోసు, చిర్ల సత్యనారాయణ రెడ్డి, సత్తి సుబ్బారెడ్డి, తమనంపూడి ఈశ్వరరెడ్డి, తమనంపూడి వెంకట సత్యనారాయణరెడ్డి, సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి - పెంటపాడు

వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిపిఎం పెంటపాడు మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, అలంపురం శాఖ కార్యదర్శి వడ్డాఇ సన్యాసిరావు కోరారు. ఈ మేరకు మండలంలోని అలంపురం గ్రామ సచివాలయంలో గుమస్తాకు శనివారాం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి, సన్యాసిరావు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మారుస్తానని, వ్యవసాయ పంటలకు మద్దతు రేటు ప్రకటిస్తానని చెప్పి మోడీ 2014లో మోడీ అధికారంలోకొచ్చాక ఆ హామీలను విస్మరించారన్నారు. మోడీ అధికారంలోకొచ్చాక వ్యవసాయ రంగం అధోగతి పాలైందన్నారు. మోడీ పరిపాలనలో ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకం, దళితులపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లంకలపల్లి అప్పారావు, జక్కంపూడి బంగారయ్య, జక్కంపూడి పెంటారావు, కొప్పునీడి నాగేశ్వరరావు, కొమ్మూరి గోపీ, కొర్ర సూరిబాబు, సురేష్, సతీష్ పాల్గొన్నారు.

యానిమేటర్ల ఉద్యోగాలకు భద్రత కల్పించాలి

నినాదాలు చేస్తున్న ఐకెపి యానిమేటర్లు

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రభుత్వం ఐకెపి యానిమేటర్ల ఉద్యోగాలకు విధించిన కనీస కాలపరిమితి మూడేళ్లను వెంటనే తొలగించి, వారి ఉద్యోగాలకు పూర్తిస్థాయి భద్రత కల్పించాలని సిఐడిఒ మండల కార్యదర్శి తవిటి నాయుడు డిమాండ్ చేశారు. జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, యానిమేటర్లకు కనీస వేతనం అమలు చేయాలని ఆయన కోరారు. ఐకెపి యానిమేటర్ల సమావేశం ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం సంఘ నాయకులు బండారు కన్యాకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో తవిటినాయుడు మాట్లాడుతూ అధికారులు, రాజకీయ నాయకులు యానిమేటర్లపై వేధింపులను తక్షణమే ఆపివేయాలన్నారు. పాదయాత్రలో జగన్ యానిమేటర్ల ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తామని చెప్పారన్నారు. అధికారంలోకొచ్చి నాలుగున్నరేళ్లు దాటినా అమలు చేయలేదన్నారు. సిఐటియు మండల అధ్యక్షులు పెంకి అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వ వాగ్దానాల అమలుకు త్వరలో రాష్ట్రస్థాయిలో ఉద్యమం చేపట్టనున్నామన్నారు. ఈ ఉద్యమంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గొడవర్తి సుధారాణి, పాకమూరి సాయి నాగమణి, వీంమల్లు నాగమణి, మందల సార, టి.శ్యామల పాల్గొన్నారు.

ఇ క్రాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - మొగల్తూరు

రైతులు తాము పండించే పంటను తప్పనిసరిగా ఇ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని ఎఒ అబ్దుల్ రహీమ్ కోరారు. శేరేపాలెం పంచాయతీ నవుడూరుగరువు, మొగల్తూరులోని నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించి ఇ క్రాప్‌పై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో సుమారు 1198 ఎకరాలకు 800 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. దీంతో రైతులు వేసిన పంటను నమోదు చేసే పనిలో వ్యవసాయ శాఖ సిబ్బంది నిమఘ్నమయ్యారు. ఇ క్రాప్ నమోదు ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతుందని, ప్రతి రైతు నమోదు చేయించుకోవాలన్నారు. ఇ క్రాప్ ద్వారా సిఎం కిసాన్ రైతుకు పెట్టుబడి సాయం అందుతుందన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు రాయితీలో పొందే అవకాశం ఉందని తెలిపారు.

22న ఐటిఐలో కౌన్సెలింగ్

ప్రజాశక్తి - ఆచంట

ఆచంటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటిఐ)లో 2023-2024 విద్యా సంవత్సరానికి నాలుగో విడత కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ iti.ap.gov.in ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపల్ ఐవి.సత్యనారాయణరాజు తెలిపారు. పదో తరగతి ఉత్తర్ణులైన విద్యార్థులు ఎస్ఎస్‌సి మార్క్స్ మెమో, టిసి, ఆధార్‌కార్డ్, స్టడీ, కుల ధ్రువీకరణ పత్రాలు జిరాక్స్ కాపీలతో పాటు రెండు పాస్‌పోర్ట్ ఫొటోలు జతపరిచి ఈ నెల 19వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 12 గంటల లోపు ప్రభుత్వ ఐటిఐలో అందించాలని తెలిపారు. ఈ నెల 22వ తేదీ శుక్రవారం కౌన్సెలింగ్ అభ్యర్థులు ఉదయం పది గంటలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని ఐటిఐ ఆచంట కాలేజీలో హాజరుకావాలని ఆయన తెలిపారు. వివరాల కోసం 9490111002 సంప్రదించాలని తెలిపారు.

చంద్రబాబు అరెస్టుపై పెల్లుబికిన నిరసన

పలుచోట్ల టిడిపి నేతల అరెస్టులు, గృహ నిర్బంధాలు

తాడేపల్లిగూడెంలో...

ప్రజాశక్తి - తణుకు

మాజీ సిఎం చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ తణుకు మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక నరేంద్ర సెంటర్‌లో టిడిపి శ్రేణులు రోడ్డుపై బైఠా యించి నిరసన చేపట్టారు. నిరసన తెలుపుతున్న రాధాకృ ష్ణతో పాటు టిడిపి శ్రేణులను పోలీసులు అరెస్టు చేయడానికి రావడంతో కార్యకర్తలు అడ్డుకున్నారు. అరెస్టు చేసిన వారిని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చంద్ర బాబు అరెస్టును ఖండిస్తూ పట్టణంలో టిడిపి శ్రేణులు బంద్ పాటించారు. పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

భీమవరం రూరల్ : చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా పోలీసులు ముందస్తుగా టిడిపి నాయకులను శనివారం హౌస్ అరెస్ట్ చేశారు. భీమవరంలో నివాసం ఉంటున్న ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజును ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. దీంతో రామరాజు ఇంటి బయట బైఠాయించి నిరసన చేపట్టారు. రామరాజుకు మద్దతుగా టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. 24 గంటలు నిరసన తెలుపుతానని ఎంఎల్ఎ రామరాజు తెలి పారు. స్థానిక బివి.రాజు పార్క్ సెంటర్‌లోని ఎన్‌టిఆర్ విగ్ర హం వద్ద టిడిపి భీమవరం నియోజకవర్గ కమిటీ ఆధ్వ ర్యంలో పార్టీ నేతలు నల్లబ్యాడ్జీలు ధరించి నల్లజెండాల తో నిరసన తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్య దర్శి వేండ్ర శ్రీనివాస్, మాజీ ఎంపిపి నెహ్రూ, ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు యేసుపాదం, ముస్లిం మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి నౌషాద్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఐజాక్ బాబు, టిడిపి సీనియర్ నాయకులు కోళ్ల సీతారాం పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో టిడిపి నాయకులు నిరసన ప్రదర్శన చేశారు. చంద్రబాబు నాయుడును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ద్విచక్ర వాహనాలపై ప్రదర్శనగా నరసాపురం వెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, కత్తిమండ ముత్యాలరావు, పాల రాంబాబు, కలిదిండి కుమార్‌బాబు పాల్గొన్నారు.

కాళ్ల : మాజీ సిఎం నారా చంద్రబాబును అరెస్ట్ చేయడం దుర్మార్గమని టిడిపి మండల అధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు అన్నారు. టిడిపి మండల కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు నల్లరెబ్బన్లతో నిరసన వ్యక్తం చేసి ధర్నా నిర్వహించారు. మండల కేంద్రమైన కాళ్లలో పార్టీ మండల అధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు మంతెన నాగాంజనేయులు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ చేస్తున్న 12 మంది టిడిపి నాయకులను కాళ్ల ఎస్ఐ వీరభద్రరావు అదుపులోకి తీసుకుని వారిపై 151 కేసు నమోదు చేసి స్టేషన్‌లో నిర్బంధించారు.

ఉండి : ఉండి టిడిపి కార్యాలయం నుంచి టిడిపి నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహం వరకు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహానికి

ఆచంటలో...

పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, ముదునూరి కృష్ణంరాజు, యశోద కృష్ణ, కిన్నెర వెంకన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు చెన్నంశెట్టి హరి నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

గణపవరం : టిడిపి గణపవరం మండల కమిటీ ఆధ్వర్యంలో పిప్పర సెంటర్ వద్ద పార్టీ నేతలు ధర్నా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులు ఇందుకూరి రామకృష్ణంరాజు మాట్లాడారు. ధర్నా చేస్తున్న పార్టీ నాయకులను గణపవరం పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ధర్నాలో టిడిపి నేతలు సురేంద్రకుమార్ రాజు, తెలుగు యువత అధ్యక్షులు అద్దేపల్లి వాసురాజు, బిసి నాయకులు యాళ్ల సుబ్బారావు, మైనార్టీ సెల్ అధ్యక్షులు బసిరుద్దీన్, కాపవరం చిన్న పాల్గొన్నారు.

పెనుమంట్ర : చంద్రబాబు నాయుడును వెంటనే విడుదల చేయాలని టిడిపి పోలమూరు నాయకులు రహదారిపై శనివారం నిరసన చేపట్టారు. మార్టేరు సెంటర్‌లో నియోజకవర్గ స్థాయిలో టిడిపి నాయకులు నిరసన తెలిపారు. నియోజకవర్గస్థాయి, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : నరసాపురంలో మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. అభిమానులు, పార్టీ శ్రేణులతో ప్రదర్శనగా బయలుదేరి వెళు ుండగా పోలీసులు అడ్డు కోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెల కొన్నాయి. చంద్రబాబును విడుదల చేయాలని టిడిపి శ్రేణులు నినాదాలు చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో చిటికెల రామ్మోహనరావు, అంద్రాజు రామన్న, కొట్టు నరసింహమూర్తి, బస్వాని ఏడుకొండలు, రేవు ప్రభుదాసు పాల్గొన్నారు. ండల నాయకుల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాణి, టిడిపి మండల కార్యదర్శి వీరవల్లి శ్రీనివాసరావు, చింతా కనకయ్య, కడల సాయిబాబు, రాయపల్లి వెంకట్, నెహ్రూ పాల్గొన్నారు. టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి

కాళ్లలో...

పొత్తూరి రామరాజును పోలీసులు శనివారం ఉదయం నుంచి గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు దారుణమన్నారు. వెంటనే విడుదల చేయాలన్నారు.

తాడేపల్లిగూడెం : టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు బాబ్జి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం పట్టణం, హౌసింగ్ బోర్డు కాలనీ ఎంట్రన్స్ ఎస్‌విఆర్ సర్కిల్ వద్ద నుంచి తాలూకా ఆఫీస్ సెంటర్, పోలీస్ సర్కిల్ మీదుగా వలవల బాబ్జి ఇంటి వరకు నిరసన కార్యక్రమంగా పాదయాత్ర నిర్వహించారు. వ్యాపారులు పట్టణంలో దుకాణాలను

గణపవరంలో...

కొంతసేపు మూసివేశారు. పోలీసు ఐ ల్యాండ్ వద్ద మానవహారం, ఎస్‌విఆర్ సర్కిల్ వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ, రూరల్, మండల నాయకులు, కమిటీ అనుబంధ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోడూరు : పోడూరు ఎన్‌టిఆర్ సెంటర్‌లో సిఎం జగన్ దిష్టిబొమ్మను టిడిపి నేతలు దహనం చేశారు. గుమ్ములూరు,పెనుమదం, కవిటం, రావిపాడు గ్రామాల్లో జగన్ దిష్టిబొమ్మలు దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, ఆర్.రవిరాజు, కుక్కల దుర్గారావు, ఆర్.సుబ్రహ్మణ్యం రాజు, పితాని సత్యనారాయణ, గొల్ల మోహన్‌రావు పాల్గొన్నారు.

ఉండి : చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ ఉండి మాజీ ఎంఎల్ఎ శివరామరాజు ఆయన నివాసంలో నిరసన దీక్ష చేపట్టారు. చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికమన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు వైసిపికి తగిన గుణపాఠం చెప్తారన్నారు.

ఆచంట : ఆచంటలో టిడిపి నాయకులు శనివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. చంద్రబాబును తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సూర్యకుమారి, కరుగోరుమిల్లి, వల్లూరు సర్పంచులు పద్మావతి సూర్యప్రకాశరావు, నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడ్డాడు.. అరెస్టయ్యాడు..
ఎంఎల్ఎ గ్రంథి శ్రీనివాస్

భీమవరం రూరల్ : స్కిల్ డివలప్‌మెంట్ పేరుతో రూ.371 కోట్ల మేర ప్రజాధనాన్ని చంద్రబాబు దోచేశాడు కాబట్టే ఆధారాలతో సహా పోలీసులు ఆయనను అరెస్టు చేశారని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు 2017లో కేబినెట్‌ను తప్పుదారి పట్టించి ఆ తర్వాత ఒప్పందంలో మరొకటి పెట్టి డబ్బులు కాజేశారని ఆనాడే ఆరోపణలు వచ్చాయన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరితో చంద్రబాబు స్కాం చేయగా ఆధారాలతో సహా అరెస్టు చేశారన్నారు.

నిజానిజాలు న్యాయస్థానాలు తేల్చాలి
మాజీ ఎంపీ హరరామజోగయ్య

పాలకొల్లు : జగన్‌పై ఆనాడు సిబిఐ పెట్టిన క్రిమినల్ కేసులు, చంద్రబాబుపై ఈనాడు రాష్ట్ర సిఐడి పెట్టిన క్రిమినల్ కేసులు రాజకీయ కక్షలతో పెట్టినవా లేక సదరు కేసులు నిజమైన అభియోగాలా అనేది నిజానిజాలు సదరు న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులపైనే ఆధారపడి ఉంటాయని మాజీ ఎంపీ చేగొండి హరరామ జోగయ్య అన్నారు. ఆయన స్వగృహంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నిజానిజాలు తేలేవరకు వేచి ఉండటం తప్ప తప్పొప్పులను ఇప్పుడే నిర్ధారించటం వివిధ రాజకీయ పక్షాలకు సమంజసం కాదని జోగయ్య చెప్పారు.

చంద్రబాబు అరెస్టు దారుణం : జనసేన

తాడేపల్లిగూడెం : చంద్రబాబును అరెస్టు చేసి రిమాండ్ చేయడం చాలా దారుణమని జనసేన పార్టీ తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం జగన్ లండన్ వెళ్లిన ప్రతిసారి రాష్ట్రంలో అరాచకాలు సృష్టించడం వైసిపికి మామూలుగా మారిందన్నారు. ఇటువంటి అక్రమ అరెస్టులను అన్ని పార్టీలు కూడా ఖండిస్తున్నాయన్నారు. అమరావతి విచ్చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో నిర్బంధించడం దారుణమన్నారు.

లోతైన దర్యాప్తు తర్వాతే అరెస్టు చేశారు
మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో లోతైన దర్యాప్తు తర్వాతే చంద్రబాబు అరెస్టు జరిగినట్లు భావిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. చంద్రబాబుపై ప్రతీకార చర్యలకు పాల్పడాల్సిన అవసరం తమ ప్రభుత్వానికి లేదన్నారు. తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో ఆయన శనివారం మీడియాతో మాట్లా డారు. సిఐడి అధికారులు లోతైన దర్యాప్తు తర్వాతే అరెస్టు చేశారన్నారు. ఇందులో ప్రభుత్వం తొందరపాటు ఏమీ లేదని, ప్రతికారం, కక్ష సాధింపు వంటివి ఏమీ లేవన్నారు.

'ప్రతిపక్షం ఉండకూడదనేది జగన్ లక్ష్యం'

భీమవరం రూరల్ : ప్రతిపక్షం ఉండకూడదనేది జగన్ లక్ష్యమని, అందుకోసమే అందరిపై కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నారని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. భీమవరం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతిపక్షాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామన్నారు. లోకేష్ పాదయాత్రలో దాడి, చంద్రబాబు అక్రమ అరెస్ట్ దారుణమన్నారు. రాజ్యాంగాన్ని వైసిపి ప్రభుత్వం ఖుని చేస్తుందన్నారు.

పోలీసుల పహారాలోనే ఉండి

ఉండి : చంద్రబాబు నాయుడు అరెస్టు నేపథ్యంలో శనివారం తెల్లవారుజాము నుంచి ఉండి ఎస్ఐ కె.గంగాధరరావు ఆధ్వర్యంలో రిజర్వ్ డిఎస్‌పి సత్యనారాయణ పర్యవేక్షణలో ఉండి మెయిన్ సెంటర్‌లో పోలీసులు పహారా నిర్వహించారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా టిడిపి కార్యాలయం వద్ద ఎఆర్ కానిస్టేబుల్స్‌తో గస్తి నిర్వహించారు. టిడిపి నాయకులు పోలీసులతో చర్చలు జరిపిన తర్వాత శాంతియుత నిరసన కార్యక్రమానికి అనుమతి ఇచ్చారు. కొంతమంది నాయకులతోనే నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వ్యాపారులకు, ప్రభుత్వ రంగ సంస్థలకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తమ కార్యకలాపాలు నిర్వహించేందుకు పోలీసులు గస్తీ నిర్వహించడంతో ఎటువంటి ఆందోళనలకు తావివ్వలేదు.

'చట్టం ముందు అందరూ సమానులే'

ఆచంట : ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టం ముందు అందరూ సమానమేనని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ అన్నారు. శనివారం ఆచంటలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబును అరెస్ట్ చేయడం ఏదో దేశద్రోహం చేస్తున్నట్లు ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. చట్టానికి ఎంతటివారైనా ఒక్కటేనన్నారు.

'చంద్రబాబు బాగోతం బట్ట బయలైంది'

ఆచంట : స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు బాగోతం బట్టబయలైందని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. కొడమంచిలిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టం ముందు అందరూ సమానులే అన్నారు. చంద్రబాబు అనేక స్కామ్‌లకు పాల్పడ్డారన్నారు.

రెండు పాస్‌పోర్టులు పడిపోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, పోడూరు మండలం, గుమ్ములూరు గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావు, తండ్రి: మసేన్ రావుకు చెందిన **S9921972**, అతని భార్య దాసరి మహాలక్ష్మి, భర్త: దాసరి శ్రీను కు చెందిన **L9293284** నెంబర్లు గల రెండు పాస్‌పోర్టులు ది.26-05-2023వ తేదీన ఇరువురు గుమ్ములూరు నుండి పాలకొల్లు ఆటోలు వెళుతుండగా రెండు పాస్‌పోర్టులు కలిగిన బ్యాగ్ మార్గ మధ్యలో పడిపోయినది. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు సంప్రదించగలరు.

దాసరి శ్రీనివాసరావు
తండ్రి: మసేన్ రావు, డో.నెం.4-68,
మంగలి వీధి, గుమ్ములూరు,
పోడూరు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా,
ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్ నెంబర్ : 534267.
సెల్: 87909 54441